క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జెండావీధికి చెందిన షమీమ్‌కు బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడుకు చెందిన పూల వ్యాపారి మస్తాన్‌తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో రూ.లక్ష నగదు, పది సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.5 లక్షల విలువ జేసే గృహోపకరణాలను మస్తాన్ కుటుంబసభ్యులకు, కట్న కానుకుల కింద ఇచ్చి రూ.రెండు లక్షలను ఇచ్చి వివాహం చేశారు. వీరిని ఇద్దరు పిల్లలు. అనంతరం మెక్లిన్స్ రోడ్డులోని మీరామొహిద్దీన్ దర్గా సమీపానికి మకాం మార్చారు. మద్యానికి మస్తాన్ బానిసయ్యారు. అదనపు కట్నం కోసం షమీమ్‌ను కొంతకాలంగా భర్త, అత్తింటివారు వేధించసాగారు. లేని పక్షంలో విడాకులివ్వాలని ఇబ్బందులకు గురిచేయసాగారు. వేధింపులను తాళలేని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

• అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడమే కాకుండా వివాహితను ఇంటి నుంచి గెంటేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం నక్కాగోపాల్ నగర్‌కు చెందిన ప్రవల్లికకు పెద్దచెరుకూరుకు చెందిన రవిచంద్రతో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహమైంది. ఆ సమయంలో రూ.లక్ష నగదు, రెండు సవర్ల బంగారు ఆభరణాలను కట్నకానుకుల కింద రవిచంద్ర కుటుంబసభ్యులకు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు ఆమెను వేధింపులకు గురిచేయసాగారు. ఇటీవల ఇంటి నుంచి గెంటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): మహిళ మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్లోని లెక్చరర్స్ కాలనీ యోగా సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న వనజ (36)కు ముగ్గురు పిల్లలు. భర్త నుంచి ఐదేళ్ల క్రితం విడిపోయిన ఆమె మరో వ్యక్తితో సహజీవనం చేస్తున్నారు. నిత్యం గుట్కా తినే వనజ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై మందులను వాడుతున్నారు. తీవ్ర కడుపు నొప్పితో గురువారం బాధపడుతుండగా, చికిత్స నిమత్తం ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు మృతురాలి అక్క లక్ష్మి ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై రమేష్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

నెల్లూరు(క్రైమ్): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన ఇరుగాళమ్మ సంఘం పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. జొన్నవాడ వైపు నుంచి నెల్లూరు వస్తున్న కారు ఇరుగాళమ్మ సంఘం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారులోని వారు బయటకు దిగేయడంతో ప్రమాదం తప్పింది. ఘటనలో వాహనం పాక్షికంగా దెబ్బతినింది.

కాలువలో పడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని యువకుడు (25) మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ హరనాథపురం సమీపంలోని సర్వేపల్లి కాలువలో పడిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం వెలికితీసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు సిమెంట్ రంగు టీ షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. బాలాజీనగర్ 17 / 2 వార్డు సెక్రటరీ సుకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు



నెల్లూరు(దర్గామిట్ట): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ఎదుట రిలే దీక్షలను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవ రావు మాదిగ మాట్లాడారు. ఈ నెల 22 వరకు దీక్షలు కొనసాగనున్నాయని చెప్పారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సుధాకర్, ఎమ్మెస్పీ జిల్లా కో కన్వీనర్ అంబేడ్కర్, జిల్లా కో కన్వీనర్ రమేష్, వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఉదయ్‌కృష్ణ పాల్గొన్నారు.

రచయితల చర్చాగోష్టి

నెల్లూరు రూరల్: తెలుగు మాండలిక భాషపై చర్చాగోష్టిని పలువురు రచయితలు శుక్రవారం నిర్వహించారు. దర్గామిట్టలోని వెంకటేశ్వర విద్యాలయంలో కార్యక్రమాన్ని విరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిపారు. రచయితలు వెంకటప్పయ్య, శివకుమార్, రామకృష్ణ, శ్రీమన్నారాయణ, విశ్రాంత గ్రంథాలయాధికారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పాహిమాం.. రక్షమాం



విశేషాలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు

• భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

నెల్లూరు(బృందావనం): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని జగజ్జనని ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు. అశేషంగా తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

• నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చనను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు సూరావరుఘుల రఘురామ్మూర్తి, వేద పండితుడు అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పర్యవేక్షించారు.

• సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకిసేవను నిర్వహించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో..



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

• పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సీతాదేవి, సువర్చలాదేవి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనను నిర్వహించారు. మహిళా భక్తులకు లక్ష్మీదేవి అమ్మవారి వెండికాసు, పసుపు, కుంకుమను అందజేశారు. పెనుగొండ సుబ్బరావు, ఐతా రామచంద్రరావు, పాదర్తి బాలాజీ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

• సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి ఆలయంలో స్వర్ణమహాలక్ష్మి మూలవర్లు, ఉత్సవమూర్తికి పూజలు చేశారు. అనంతరం శ్రీచక్రార్చన, పంచమహా హారతులు, ధనలక్ష్మీ కుబేర హోమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులు రెడ్డి, స్నేహలత దంపతులు వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

చేనేత ప్రతినిధుల నిరసన

నెల్లూరు(మినీబైపాస్): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చేనేత విభాగానికి సంబంధించిన హ్యాండ్లూమ్ వారి విశ్వకర్మ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లాకు సంబంధించిన చేనేత ప్రతినిధులను పిలిచి కార్యక్రమానికి ఏడీ ఆనంద్‌కుమార్ గైర్హాజరవడంతో చేనేత నేతలు నిరసన చేపట్టారు. అనంతరం కార్యక్రమం నుంచి వాకౌట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ బూధాటి రాధాకృష్ణయ్య, నందం అశ్వత్థామ, బుధవరపు బాలాజీ, సోమ గోపాల్, మల్లికార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించండి



సమావేశంలో కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో వచ్చిన ప్రజా విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు అందజేసిన అర్జీలపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ, తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ హాల్లో కలెక్టర్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూపరమైన అర్జీలను పరిష్కరించేందుకు అన్ని విధాలా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గానూ ప్రత్యేక సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్న కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలను తెలియజేశారు. జేసీ కూర్మనాథ్, ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓ కరుణకుమారి, జిల్లా ల్యాండ్స్ సర్వే సెటిల్‌మెంట్ అధికారి హనుమాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంతో లబ్ధి

ఆత్మకూరు నియోజకవర్గంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోల సహకారంతో గుర్తించిన రెవెన్యూ సమస్యలు పరిష్కారమైతే దాదాపు 20 వేల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ కరుణకుమారి, తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో 25 వేల నోషనల్ ఖాతాల సమస్యలు, ఏడు వేల వరకు సాదాబైనామా, చుక్కల భూముల సమస్యల పరిష్కారం కోసం సమీక్షను ఇప్పటికే నిర్వహించామని చెప్పారు. వీటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొస్తున్న వలంటీర్లపై ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఆరోపణలు చేశారని, సమస్యలను తెలుసుకుంటేనే పరిష్కరించగలమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, రెవెన్యూ సమన్వయ కమిటీ సభ్యులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, గడ్డం శ్రీనివాసులురెడ్డి, అంబవరపు కోటిరెడ్డి, గుండాల బాలచంద్రారెడ్డి, అక్కలరెడ్డి అంకిరెడ్డి, సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, రమేష్, కొమ్మి సిద్ధులునాయుడు, రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు బుద్ధి చెప్పే రోజు త్వరలోనే..

వలంటీర్ల వ్యవస్థపై మొదట్నుంచి ఆరోపణలు చేస్తూనే ఉన్నారని, వీరందరికీ ప్రజలు బుద్ధి చెప్పే రోజు త్వరలోనే వస్తుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణకు ముందు సమీక్షలు నిర్వహించుకోవడం ఏడాదిగా కొనసాగుతోందని, ఏ సంబంధం లేని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సమీక్ష మధ్యలోకి వచ్చి ఓట్లను తొలగిస్తున్నారంటూ ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఇలా మాట్లాడినా మర్యాద ఇచ్చి సాగనంపామని, పునరావృతమైతే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. ఓట్లు తొలగిస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారని, ఈ విషయమై సమగ్ర విచారణ చేపట్టాలని తానూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రాజీనామా

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పదవికి రాజీనామా చేశానని అన్వర్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందానని, ఏడాది పూర్తయిన నేపథ్యంలో బైలాస్ ప్రకారం రాజీనామా చేశానన్నారు. ఈ పత్రాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్, నెల్లూరు బార్ అసోసియేషన్‌కు పంపానని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో మైపాడు రోడ్డును విస్తరించిన ప్రాంతాల్లో తీగలను మార్చనున్న క్రమంలో బోడిగాడితోట, జాకీర్‌హుస్సేన్‌నగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కావేరినగర్ ఫీడర్‌లో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఉమ్మారెడ్డిగుంట, డీమార్ట్ ప్రాంతం, రవీంద్రనగర్, వనంతోపు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• పడారుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీఏ కార్యాలయ ఫీడర్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మలను తొలగించనున్న తరుణంలో రాజుకాంప్లెక్స్, ఆర్టీఏ కార్యాలయం, బీవీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• గోమతినగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా రామలింగాపురం, మినీబైపాస్ రోడ్డు, ఇస్కాన్ సిటీ, శ్రీహరినగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• హరనాథపురం సబ్‌స్టేషన్లో మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో హరనాథపురంలోని ఒకటి నుంచి నాలుగో వీధి వరకు, అపోలో ఆస్పత్రి, ఆదిత్యనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని వివరించారు.

• ఎంజీనగర్, రాజేంద్రనగర్, వైఎమ్సీఏ, డీఎస్సార్ ఆస్పత్రి, తెలుగుగంగ, ఏకేనగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లోని ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

• కొత్తూరు, ఆమంచర్ల, సౌత్‌మోపూరు, దేవరపాళెం, బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి



తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో శనివారం నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌లో వీలైనన్ని కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. మెగా లోక్ అదాలత్ నేపథ్యంలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజీ మార్గ ప్రాధాన్యాన్ని ఇరువర్గాలకు తెలియజేసి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని కోరారు. లోక్ అదాలత్‌తో సమస్యలకు సత్వర, శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ దృష్టికి హోటల్ రంగ సమస్యలు



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా హోటల్స్ అసోసియేషన్ నేతలు శుక్రవారం కలిశారు. నగరంలోని హోటళ్ల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. చెత్త పన్ను రూపంలో హోటల్ రంగంపై రూ.రెండు వేలను కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తున్నారని, దీనికి రూ.పది వేలకు పెంచారని తెలిపారు. ఈ విషయంలో తమను ఆదుకోవాలని కోరారు. కాగా కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. తొలుత ఎంపీని సత్కరించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని 49, 51వ డివిజన్లలో గల వార్డు సచివాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు అందించాల్సిన సేవలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీజీ, భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు.

ఆదుకోవాలని వినతి



చిన్నారులతో మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'చిన్నప్పుడే నాన్న చనిపోయారు.. అమ్మ కూలీ పనులు చేసి మమ్మల్ని చూసుకుంది.. 2021లో కోవిడ్ కారణంగా ఆమెనూ కోల్పోయాం.. మాకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు రెండుసార్లు వచ్చి వెనక్కి వెళ్లింది'.. పరిశీలించి న్యాయం చేయాలని సంగం మండలం వెంగారెడ్డిపాళేనికి చెందిన చిన్నారులు అల్లాడి లాస్య, ప్రజ్వల్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ ఆ బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): భూములు, తదితర ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సమావేశాలతో సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ప్రతిపాదనలను కలెక్టరేట్‌కు పంపాలని పేర్కొన్నారు. గ్రామాల్లో శ్మశానాలు, వాటికి రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. చుక్కల భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు నీటిపారుదల భూముల విషయమై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగావకాశాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోల, సర్వే ఏడీ హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్ నుంచే పోటీ చేస్తున్నా

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచే తాను పోటీ చేయనున్నానని, ఈ విషయంలో అవాస్తవాలను ప్రచారం చేయడాన్ని మానుకోవాలని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 17వ డివిజన్లోని వడ్డిపాళెంలో సైడ్ కాలువల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు రూరల్ నుంచి తాను పోటీ చేయనంటూ కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి వాటిని మానుకోవాలని హితవు పలికారు. కావలి నుంచి తాను పోటీ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. రూరల్ ప్రాంతంలో మరో రూ.40 కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టను న్నామని ప్రకటించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, లంకా రామశివారెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ సమావేశం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేటలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా మహిళా సెక్రటరీగా విజయ, ఉపాధ్యక్షురాలిగా యామిని శైలజ, యువజన విభాగ జిల్లా ఉపాధ్యక్షులుగా నరేష్, ప్రతాప్, జాయింట్ సెక్రటరీగా ప్రదీప్‌ను ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, రిటైర్డ్ పంచాయతీరాజ్ డీఈ మస్తానయ్య, యూత్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

కృష్ణుడికి విశేష పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో..



విశేషాలంకారంలో కృష్ణుడు

నెల్లూరు(బృందావనం): రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిర ప్రాంగణంలో గల కల్యాణ మండపంలో హోమాలు, పూజలు, తదితరాలను నిర్వహించారు. హోమాన్ని ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా రాఘవేంద్ర, శైలజ, నరసింహయాదవ్, పద్మజ, ఆదిశేషశర్మ, రమాదేవి దంపతులు వ్యవహరించారు. అన్నమయ్య సంకీర్తనలు, హరికథా గానాన్ని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు తదితరులు పర్యవేక్షించారు.

• బాలాజీనగర్‌లోని పిండిమిల్లు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలను బాలాజీనగర్ యూత్ అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్టు రాజేశ్వరమ్మ, యూత్ సభ్యులు రమేష్‌రాజు, జీవన్‌కుమార్, శేఖర్, దుర్గ, శివ, చక్రి, అనిల్, చందు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

• వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు.

• క్రాంతినగర్‌లో కృష్ణుడి నగరోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా దరిశిగుంట సూర్యప్రకాష్ రావు, వరలక్ష్మి, మునిరాజా, మునిలక్ష్మి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ దరిశిగుంట పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

• మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారు కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తగా వెంకటరాజా మోహన్‌రావు వ్యవహరించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



బాలాజీనగర్‌లో..



అక్కచెరువుపాడులో..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని బాలాజీనగర్‌లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకొని డివిజన్లోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి విజయశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, శ్రీవల్లి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: అంబాపురం సెక్టార్ పరిధిలోని అక్కచెరువుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను సూపర్‌వైజర్ స్వరూప అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు టీఎమ్మార్‌ను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, రత్నమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.